పద్దుకు వేళాయెరా..

రేపే కేంద్ర బడ్జెట్ • టాప్-10 అంచనాలివే

న్యూఢిల్లీ, జనవరి 30: మరికొద్ది గంటల్లో కేంద్ర బడ్జెట్ ఆవిష్కృతం కానున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను పార్లమెంట్‌లో శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఎప్పట్లాగే ఈసారీ సమాజంలోని ఆయా వర్గాలు, ముఖ్యంగా మధ్యతరగతి ప్రజానీకం, సగటు ఉద్యోగులు పద్దుపై బోలెడు ఆశలు, అంచనాలు పెట్టుకున్నారు. ప్రధానంగా వ్యక్తిగత ఆదాయ పన్నుకు సంబంధించి ఊరటనివ్వాలని పెద్ద ఎత్తున కోరుతున్నారు. మరి వాటిని మోదీ సర్కారు ఏ మేరకు నెరవేరుస్తుందో చూడాలి. ఇక రాబోయే బడ్జెట్‌పైనున్న టాప్-10 అంచనాలివే..

ఐటీ శ్లాబులు-రేట్లు

కొత్త, పాత వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) విధానాల్లో శ్లాబులు, రేట్లను మార్చాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుకుంటున్నారు. అయితే ఐదేండ్ల కిందట కొత్త ఆదాయ పన్ను విధానాన్ని తీసుకొచ్చిన మోదీ సర్కారు.. అప్పట్నుంచి పాత ఆదాయ పన్ను విధానం జోలికే వెళ్లడం లేదు. కొత్త విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చడానికే ప్రతీ బడ్జెట్‌లో సవరణలు చేస్తూ వస్తున్నది. దీంతో ఈసారి కొత్తదానిలో వార్షిక ఆదాయం రూ.20 లక్షలు, అంతకుమించి ఉంటేనే 30 శాతం పన్ను వేయాలన్న డిమాండ్లు భారీగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రూ.15 లక్షలు దాటితే 30 శాతం పన్ను పడుతున్నది. అలాగే రూ.12-15 లక్షల శ్లాబుపై వర్తిస్తున్న 20 శాతం పన్నును 15 శాతానికి కుదించి.. కొత్తగా రూ.10-15 లక్షల శ్లాబును తీసుకురావాలని కోరుతున్నారు.

స్టాండర్డ్ డిడక్షన్

కొత్త ఆదాయ పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్‌ను లక్ష రూపాయలకు పెంచాలని పన్ను చెల్లింపుదారులు కోరుతున్నారు. పెంచితే మరింత మంది ట్యాక్స్‌పేయర్స్ కొత్త విధానంలోకి వచ్చే వీలుందని నిపుణులూ చెప్తున్నారు. ఇక కిందటి బడ్జెట్‌లో రూ.50వేల నుంచి రూ.75వేలకు పెంచిన విషయం తెలిసిందే. మరోవైపు పాత పన్ను విధానంలోనూ స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.75వేలకు పెంచాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

పన్ను మినహాయింపు

కొత్త ఆదాయ పన్ను విధానంలో ఇప్పుడు వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా ఉంటే ఎలాంటి పన్ను లేదు. అయితే దీన్ని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక పాత ఆదాయ పన్ను విధానంలోనూ ఈ పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుతమున్న రూ.2.5 లక్షల నుంచి 3 లక్షలకు పెంచాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ఆదాయ పన్ను రిబేటు

ప్రస్తుతం వ్యక్తిగతంగా పన్ను సహిత ఆదాయం ఏటా రూ.7 లక్షలదాకానే ఉంటే పూర్తిగా ట్యాక్స్ రిబేటుకు వీలుంటున్నది. అయితే దీన్ని ఈసారి బడ్జెట్‌లో రూ.10 లక్షలకు పెంచాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుతున్నారు. కొత్త ఆదాయ పన్ను విధానంలో రావాలని కోరుతున్న ఈ మార్పుతో మధ్యతరగతి వర్గాలకు పెద్ద ఊరట లభిస్తుందని చెప్తున్నారు. వినిమయ శక్తి కూడా పెరిగి మార్కెట్‌కు కొత్త ఉత్సాహం వస్తుందనీ నిపుణులు పేర్కొంటున్నారు.

సెక్షన్ 80సీ

కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ ప్రయోజనాలను తేవాలని పలువురు ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు. ప్రస్తుతం పాత ఆదాయ పన్ను విధానంలో సెక్షన్ 80సీ కింద ఏటా గరిష్ఠంగా రూ.1.5 లక్షలదాకా పన్ను మినహాయింపులను ట్యాక్స్‌పేయర్స్ క్లెయిం చేసుకోవచ్చన్న సంగతి విదితమే. ఇదిలావుంటే దీన్ని రూ.2 లక్షలకు పెంచాలని పాత ఆదాయ పన్నును ఎంచుకొంటున్నవారూ డిమాండ్ చేస్తున్నారు.

ఎన్‌పీఎస్‌కు ప్రోత్సాహకాలు

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)ను మరింత మంది ఎంచుకొనేలా ఈ బడ్జెట్‌లో పలు నిర్ణయాలు, ప్రోత్సాహకాలు ఉండొచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి పూర్తిగా పన్ను మినహాయింపును కల్పించవచ్చని, పాత ఆదాయ పన్ను విధానంలో ఉన్నట్టుగానే.. కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ ఎన్‌పీఎస్‌కు రూ.50వేలదాకా అదనపు పన్ను ప్రయోజనాలను కల్పించవచ్చని చెప్తున్నారు.

హెచ్‌ఆర్‌ఏ ప్రయోజనాలు

మెట్రోపాలిటన్ ప్రాంతాలకుతోడు ద్వితీయ శ్రేణి నగరాల్లో ఉంటున్నవారికీ హౌజ్ రెంట్ అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ) ప్రయోజనాలు అందేలా ఈసారి బడ్జెట్‌లో చర్యలుంటాయని అంచనా. బేసిక్ సాలరీలో 40 శాతానికి బదులుగా 50 శాతానికి హెచ్‌ఆర్‌ఏ మినహాయింపుల్ని పెంచవచ్చని చెప్తున్నారు.

సెక్షన్ 80డీ

పెరిగిన ఖర్చుల దృష్ట్యా ఆరోగ్య బీమా ప్రీమియంలూ పెరిగిపోతున్నాయి. సమగ్ర కవరేజీ కోసం మరింత ఖర్చు చేయాల్సిన పరిస్థితి పాలసీదారులకు వచ్చింది. దీంతో కొత్త ఆదాయ పన్ను విధానంలో ఆరోగ్య బీమా కోసం చేసే ప్రీమియం చెల్లింపులపై ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80డీ కింద ఉండే ప్రయోజనాలను వర్తింపజేయాలని కోరుతున్నారు.

సెక్షన్ 80జీ/80టీటీఏ

స్వచ్ఛంధ సంస్థలకు విరాళాలు పెరిగేలా, బ్యాంకుల్లో పొదుపును ప్రోత్సహించేలా ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80జీ/సెక్షన్ 80టీటీఏ ప్రయోజనాలను కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ అమలుపర్చవచ్చని అంచనా.

గృహ రుణగ్రహీతల కోసం..

నిర్మాణ రంగానికి ఊతమిచ్చేలా స్థిరాస్తి కొనుగోలుదారులకు వివిధ రకాల పన్ను ప్రయోజనాలను బడ్జెట్‌లో ప్రకటిస్తారని అంచనాలున్నాయి. ఇందులో భాగంగానే గృహ రుణగ్రహీతలకు అసలు, వడ్డీ చెల్లింపులపై పన్ను మినహాయింపులను పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఏటా రూ.2 లక్షలదాకా పన్ను ప్రయోజనాలను ట్యాక్స్‌పేయర్స్ క్లెయిం చేసుకోవచ్చు. అయితే దీన్ని రూ.3 లక్షలకు పెంచవచ్చని అంటున్నారు. అలాగే ఆదాయ పన్ను రిటర్ను (ఐటీఆర్)ల ప్రక్రియను మరింత సులభతరం చేయవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

ప్రస్తుతం దేశంలోని ట్యాక్స్‌పేయర్లలో 78 శాతం కొత్త ఆదాయ పన్ను విధానాన్నే ఎంచుకుంటున్నారు. దీంతో పాత ఆదాయ పన్ను విధానాన్ని కోరుకుంటున్న ఆ మిగతా 22 శాతం మందినీ కొత్త విధానంలోకే తెచ్చేందుకు ఈసారీ పాత విధానంలో ఎలాంటి మార్పులు చేయకపోవచ్చని, కొత్త దానిలోనే సవరణలు చేస్తారన్న అంచనాలు నిపుణుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ముమ్ముందు పాత పన్ను విధానాన్ని పూర్తిగా ఎత్తేసే వీలు కూడా లేకపోలేదన్న అభిప్రాయాలను వారు వ్యక్తం చేస్తుండటం గమనార్హం. కేవలం పాత ఆదాయ పన్ను విధానంలోనే వివిధ సెక్షన్ల కింద రకరకాల ఆదాయ-వ్యయాలకు, పెట్టుబడులు-పొదుపులకు ఇప్పుడు ట్యాక్స్‌పేయర్స్ పన్ను మినహాయింపులను కోరే వెసులుబాటు ఉంటున్న సంగతి విదితమే.



బడ్జెట్ కూర్పులో నిర్మల టీం ఇదే..

వీ అనంత నాగేశ్వరన్: ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థి. భారత ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారుగా పనిచేస్తున్నారు.

మనోజ్ గోవిల్: ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి. మధ్యప్రదేశ్‌కు చెందిన 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. కేంద్ర వ్యయ కార్యదర్శిగా ఉన్నారు.

అజయ్ సేథ్: ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి. బడ్జెట్ డాక్యుమెంట్లకు తుదిరూపునివ్వడంలో నేర్పరి.

తుహిన్ కాంత పాండే: ఆర్థిక, రెవిన్యూ కార్యదర్శి. ఒడిషా కేడర్ ఐఏఎస్ అధికారి.

అరుణిష్ చావ్లా: ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల శాఖ కార్యదర్శి. బీహార్ కేడర్ ఐఏఎస్ అధికారి.

ఎం నాగరాజు: త్రిపురకు చెందిన 1993 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆర్థిక సేవల కార్యదర్శిగా ఉన్నారు.

ఫెడ్ వడ్డీరేట్లు యథాతథం

వాషింగ్టన్, జనవరి 30: వరుసగా వడ్డీరేట్లను తగ్గించుకుంటూ వచ్చిన అమెరికా ఫెడరల్ రిజర్వు ఈసారి రేట్లను యథాతథంగా ఉంచింది. ద్రవ్యోల్బణ గణాంకాలు పుంజుకుంటుండటం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలసీల ప్రభావంతో వేచి చూసేదోరణిలో అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఈసారి రేట్లను యథాతథంగా ఉంచడానికి మొగ్గుచూపింది. గడిచిన ఏడాదికాలంలో రేట్లను 5.3 శాతం నుంచి 4.3 శాతానికి దించింది.

बैंक ऑफ़ बड़ौदा
Bank of Baroda

బీవోబీ లాభం 4,837 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 30: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.4,837 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4,579 కోట్ల లాభంతో పోలిస్తే 5.6 శాతం వృద్ధి కనబరిచినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో బ్యాంక్ రూ.34,676 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.31,416 కోట్లతో పోలిస్తే 10 శాతం వరకు పెరిగింది. దీంట్లో వడ్డీల ద్వారానే రూ.30,908 కోట్ల ఆదాయం సమకూరింది. గత త్రైమాసికంలో బ్యాంక్ ఆపరేటింగ్ ప్రాఫిట్ రూ.7,015 కోట్ల నుంచి రూ.7,664 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్‌ఈకి సమాచారం ఇచ్చింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 3.08 శాతం నుంచి 2.43 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ 0.7 శాతం నుంచి 0.59 శాతానికి దిగొచ్చింది. అయినప్పటికీ మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ గత త్రైమాసికంలోనూ రూ.1,082 కోట్ల నిధులు వెచ్చించింది.

దొడ్ల డెయిరీ 280 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, జనవరి 30: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ దొడ్ల డెయిరీ లిమిటెడ్ అంచనాలకుమించి రాణించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.63.56 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.41.33 కోట్లతో పోలిస్తే 54 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. కంపెనీ ఆదాయం రూ.752.5 కోట్ల నుంచి రూ.912.20 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. వ్యాపార విస్తరణలో భాగంగా రూ.280 కోట్ల పెట్టుబడితో మహారాష్ట్రలో నూతన పాల శీతలీకరణ ప్లాంట్‌ను నెలకొల్పబోతున్నట్లు కంపెనీ ఎండీ దొడ్ల సునీల్ రెడ్డి తెలిపారు. ఈ నిధులను కంపెనీ అంతర్గత వనరుల ద్వారా సేకరిస్తున్నట్లు, అలాగే రోజుకు 17.1 లక్షల లీటర్ల పాలను రైతుల నుంచి సేకరించి ప్రాసెసింగ్ చేస్తున్నట్లు చెప్పారు.

ఇప్పట్లో 'బిల్డ్ నౌ' పోర్టల్ లేనట్టే!

అందుబాటులోకి రాని సాఫ్ట్‌వేర్ • పాత విధానంలోనే 'రియల్' అనుమతులు

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): రియల్ అనుమతులు పొందడం ఇక సులభతరమే అని ఆశలు పెట్టుకున్న వ్యాపారులకు నిరాశే దక్కింది. ప్రభుత్వం ప్రకటించిన బిల్డ్ నౌ పోర్టల్‌కు ఆటంకాలు మొదలయ్యాయి. కొత్త పోర్టల్‌కి సంబంధించిన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రాలేదని తెలిసింది. ఎప్పుడు అందుబాటులోకి వస్తుందన్న అంశంపైనా క్లారిటీ లేకుండా పోయింది. దీంతో వ్యాపారస్తులు పాత విధానంలోనే దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.

కనిపించని చిత్తశుద్ధి..

'బిల్డ్ నౌ' పేరిట కొత్త పోర్టల్ విధానాన్ని ఫిబ్రవరి 1నుంచి అమల్లోకి తీసుకువస్తున్నట్టు స్వయంగా మంత్రి శ్రీధర్‌బాబు గత నెల మొదటి వారంలో అధికారికంగా ప్రకటించారు. కానీ ఆ మేరకు చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్టు కనిపించటంలేదు. రియల్ అనుమతుల కోసం జీహెచ్‌ఎంసీ, మున్సిపాలిటీ, డీటీసీపీ వంటి విభాగాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఏఐ సహకారంతో బిల్డ్ నౌ పోర్టల్ విధానాన్ని తెరపైకి తెచ్చారు. కానీ, సంస్థల నుంచి అనుమతులు పొందడంతోపాటు అధికారులు ఏ విధంగా దరఖాస్తులు స్వీకరించి, అనుమతులు మంజూరు చేయాలన్న అంశాలపై ఇప్పటికీ శిక్షణ ఇవ్వలేదు.

ఎన్‌ఎల్‌సీ ప్రాజెక్టులపై కిషన్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్‌ఎల్‌సీ) ప్రాజెక్టులపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 2047 నాటికి వికసిత్ భారత్‌గా అభివృద్ధి చేయాలన్న ప్రధాని మోదీ విజన్‌లో భాగంగా కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖలో పలు సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఒడిశాలోని తాలాబిరా, మచ్చకట పాత్రపారాల్లో.. జార్ఖండ్‌లోని సౌత్ పచ్వారా, నార్త్ దాదుల్లో బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఎన్‌ఎల్‌సీ ద్వారా విశేషమైన కృషి జరుగుతుందన్నారు. ఎన్‌ఎల్‌సీలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులకు ప్రమాద బీమా వర్తించేలా పరిశీలించాలని సూచించారు

అభివృద్ధిలో వెలిచాలకు సాటిలేదు

యూనిసెఫ్ ఢిల్లీ బృందం ప్రతినిధుల కితాబు

వెలిచాల జీపీ ఆవరణలో ఏర్పాటు చేసిన వైకుంఠపాలిని పరిశీలిస్తున్న యూనిసెఫ్ బృందం ప్రతినిధులు

రామడుగు, జనవరి 30: అభివృద్ధిలో వెలిచాల గ్రామానికి మరోటి సాటి రాదని ఢిల్లీ యూనిసెఫ్ బృందం సభ్యులు కితాబిచ్చారు. రామడుగు మండలం వెలిచాలను కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి యూనిసెఫ్ ప్రతినిధులు సందర్శించారు. ఐసీడీఎస్, మహిళా సంఘాల సభ్యులు అతిథులకు బతుకమ్మతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఢిల్లీ ప్రతినిధి పొల్కేజి వర్క్‌నే మాట్లాడుతూ, వెలిచాల గ్రామం చాలా పరిశుభ్రంగా ఉందన్నారు. ఈ గ్రామాన్ని సందర్శించడం సంతృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, యూనిసెఫ్ హైదరాబాద్ ప్రతినిధులు వెంకటేశ్, ప్రభాత్, ఫణీంద్ర, డీఆర్‌డీవో సబిత, బీసీ అభివృద్ధి అధికారి, మండల ప్రత్యేకాధికారి అనిల్ ప్రకాశ్, యూనిసెఫ్ కోఆర్డినేటర్ కిషన్‌స్వామి, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో రాజేశ్వరి, హెచ్‌ఎం కన్నం రమేశ్ పాల్గొన్నారు.

జిల్లాలో స్వచ్ఛత కార్యక్రమాలకు యూనిసెఫ్ ప్రశంస

కలెక్టరేట్, జనవరి 30 : జిల్లాలో చేపట్టిన స్వచ్ఛత కార్యక్రమాల ప్రగతి అభినందనీయమని, యూనిసెఫ్ ఢిల్లీ బృందం ప్రశంసించింది. జిల్లాలో చేపట్టిన పలు ప్రగతి కార్యక్రమాలు పరిశీలించేందుకు ఢిల్లీ, రాష్ట్ర ప్రతినిధుల బృందం జిల్లాను సందర్శించింది. ముందుగా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఢిల్లీ ప్రతినిధులతో కలెక్టర్, అదనపు కలెక్టర్లు సమావేశమయ్యారు. జిల్లాలో కొనసాగిస్తున్న పలు స్వచ్ఛతా కార్యక్రమాలపై చర్చించారు.

సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీఐజీ

గంగాధర, జనవరి 30 : గంగాధర మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ రవీందర్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. డీఐజీ వచ్చే సమయానికి కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ సబ్‌మిట్ చేసే క్రమంలో పార్టీల సంతకాలు, మున్సిపల్, కార్పొరేషన్ అయితే తప్పకుండా ఇంటి ఫొటో, రూట్ మ్యాపు విధిగా జతచేయాలని సూచించారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం బిల్డింగ్ కోసం స్థలం మంజూరైందని, నూతన బిల్డింగ్ కోసం ప్రపోజల్లు పంపించామని తెలిపారు.

అండర్ గ్రౌండ్ కేబుల్ పనుల పరిశీలన

ముకరంపుర, జనవరి 30: స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా టవర్ సర్కిల్లో చేపడుతున్నందున అండర్ గ్రౌండ్ కేబుల్, కాంపాక్ట్ ట్రాన్స్ ఫార్మర్ పనులను గురువారం ఎన్పీడీసీఎల్ సీఎండీ కే వరుణ్ రెడ్డి పరిశీలించారు. డిస్కం, సర్కిల్ స్థాయిలో ఉత్తమ సేవలకు అవార్డులు పొందిన అధికారులు, సిబ్బందిని సీఎండీ అభినందించారు. ఎస్ఈ రమేశ్ బాబు, డీఈలు ఉపేందర్, రాజం, ఏడీఈ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

'నాగంపేట'లో డీఎల్పీవో విచారణ

జమ్మికుంట, జనవరి 30: నాగంపేట గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులు, అభివృద్ధి కోసం ఖర్చు చేసిన వివరాలపై నాగేశ్వర్‌రావు అనే వ్యక్తి ఆర్టీఐకి దరఖాస్తు చేయడం.. శ్రీనివాసాచారి అనే మరో వ్యక్తి కార్యదర్శుల ఇష్టారాజ్యం, తదితర అంశాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం 'నాగంపేట'కు డీఎల్పీవో పాత శ్రీనివాస్ విచారణకు వచ్చి.. వెళ్లినట్లు తెలిసింది. విచారణ ఆద్యంతం తూతూమంత్రంగా సాగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు(ఎంపీవో), ప్రస్తుత కార్యదర్శి అంకూసు, బదిలీపై వెళ్లిన కార్యదర్శి శ్రీనివాస్(వీరిపైనే ఫిర్యాదులు) రావాల్సి ఉండగా, ఇందులో శ్రీనివాస్ రానట్లు సమాచారం. అయితే విచారణ అంశాలపై డీఎల్పీవో శ్రీనివాస్‌ను 'నమస్తే' వివరణ కోరగా.. విచారణకు వచ్చింది వాస్తమేనని, ఫిర్యాదుదారు శ్రీనివాసాచారికి తెలియజేసినా రాకపోవడంతో వెళ్లిపోతున్నామని చెప్పారు.

చిన్నారులు.. రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలి

- తల్లిదండ్రులు నియమ నిబంధనలు పాటించేలా చేయాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

రవాణాశాఖ అధికారులతో కలెక్టర్

తిమ్మాపూర్, జనవరి 30: విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలని, తల్లిదండ్రులకు నియమ నిబంధనలు వివరించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలోని చిల్డ్రన్స్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కులో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. రవాణా శాఖ కార్యాలయంలోని చిల్డ్రన్ ట్రాఫిక్ పార్కు ఆధునీకరణ, మరమ్మతుల కోసం డీటీసీ పురుషోత్తం నిధులు కోరగా, ఆమె సానుకూలంగా స్పందించారు. పార్క్‌ను మరింత అభివృద్ధి చేసి పిల్లలకు నిత్యం అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీసీతో పాటు డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి, ఎంవీఐ రవికుమార్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంఈవో శ్రీనివాస్, ఏఎంవీఐలు స్రవంతి, హరిత యాదవ్, ఉమ్మడి జిల్లాలోని ఏఎంవీఐలు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

కలెక్టరేట్, జనవరి 30 : ప్రభుత్వ ఉద్యోగులు విధుల నిర్వహణతో పాటు తమ ఆరోగ్యం పట్ల కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఇటీవల పంచాయతీ రాజ్ ఈఈ చంద్రశేఖర్ గుండెపోటుతో మృతిచెందగా, సహచర ఉద్యోగులు ఆయన సంతాప సభను జడ్పీ సమావేశమందిరంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, మరణించిన అధికారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఈఈతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని, భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య అమరులకు అధికారుల నివాళి

కలెక్టరేట్, జనవరి 30 : దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరులను స్మరిస్తూ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం నిర్వహించిన ఈకార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, అమరుల ఆత్మకు శాంతి చేకూరేలా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అంతకుముందు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు.

జర్నలిస్టుల పోరాటాన్ని కొనసాగిస్తాం

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బండ శ్రీనివాస్

హుజూరాబాద్ టౌన్, జనవరి 30: జర్నలిస్టుల నివేశన స్థలాల పోరాటానికి బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఉంటుందని, జర్నలిస్టుల శక్తి తగ్గితే బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రభుత్వంపై పోరాటాన్ని కొనసాగిస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండ శ్రీనివాస్ పేర్కొన్నారు. నివేశన స్థలాల కోసం పట్టణంలో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్న జర్నలిస్టులకు ప్రజా సంఘాల నాయకులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బండ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఆసరా అవుదామని ఇండ్లు ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులకు మద్దతుగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, మాజీ వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మలా శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు, ప్రజా సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు వీర్ల సహకారం



సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

రామడుగు, జనవరి 30 : రామడుగు, కొత్తపల్లి మండలాల శివారులో కొత్తపల్లి నుంచి వెలిచాలవైపు వెళ్లే నాలుగురోడ్ల కూడలి అయిన బైపాస్ దారిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు సహకారం అందించారు. ఈ మార్గంలో ప్రతిరోజూ అనేక ప్రమాదాలు చోటుచేసుకోవడం, అసాంఘిక ఘటనలు, దొంగతనాలు జరుగుతున్న దృష్ట్యా వెలిచాల, వెదిర, దేశరాజ్‌పల్లి, కొత్తపల్లి, మల్కాపూర్, చింతకుంట గ్రామాల ప్రజలు, యువకులతో పాటు కొత్తపల్లి ఎస్సై విజ్ఞప్తి మేరకు సీసీ కెమెరాల ఏర్పాటుకు చేయూతనందించారు. ఈ సందర్భంగా వీర్ల వెంకటేశ్వరరావుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, యువకులు, పోలీసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



హర్డిల్స్ జంప్‌లో పాల్గొన్న క్రీడాకారులు

హోరాహోరీగా పోలీసు క్రీడలు



బాడీ బిల్డింగ్ పోటీల విజేతకు పతకం బహూకరిస్తున్న సీపీ అభిషేక్ మొహంతి

కొత్తపల్లి, జనవరి 30 : కరీంనగర్‌లోని పరేడ్ మైదానంలో ఈనెల 28 నుంచి ప్రారంభమైన 3వ తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీసు క్రీడా పోటీలు మూడో రోజు హోరాహోరీగా సాగాయి. గురువారం బాక్సింగ్, కరాటే, క్రాస్ కంట్రీ, టేబుల్ టెన్నిస్, ఇండియన్ మేడ్ సైకిల్ రోడ్ రేస్ విత్ అవుట్, విత్ గేర్, ఆర్చరీ, స్విమ్మింగ్, యోగ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పలు జోన్లకు చెందిన క్రీడాకారులు 31 బంగారు , 28 వెండి , 33 కాంస్య పతకాలను గెలుచుకున్నారు. విజేతలకు ముఖ్య అతిథిగా హాజరైన మల్టీజోన్ -1 ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి, బజాజ్ ఎలక్ట్రానిక్స్ కేటగిరీ హెడ్ ఎండీ రమీజ్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. మానేరు దిగువ జలాశయంలో నిర్వహించిన వాటర్ స్పోర్ట్స్ విభాగంలోని కెనోయింగ్, కయాకింగ్ క్రీడలను ఐజీపీ స్పోర్ట్స్ రమేశ్‌రెడ్డి, కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి తిలకించారు. ఫిబ్రవరి 1న పోటీలు ముగియనున్నాయి.

సబ్‌సెంటర్‌లో నాగుపాము కలకలం

వీణవంక, జనవరి 30: పీహెచ్‌సీ సబ్‌సెంటర్‌లోకి నాగుపాము చొరబడి హల్‌చల్ చేసిన ఘటన ఘన్ముక్ల గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఘన్ముక్ల పీహెచ్‌సీ సబ్‌సెంటర్ పక్కన ఉన్న సీసీ రోడ్డు నుంచి సెంటర్‌లోకి ప్రవేశించిన నాగుపాము టేబుల్ పైకి ఎక్కి బుసకొడుతుండడంతో గమనించిన సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. సుమారు రెండు గంటల పాటు అక్కడే ఉన్న పాము జీపీ సిబ్బంది వెళ్లగొట్టే ప్రయత్నం చేయగా, పక్కనే టాయిలెట్స్ వద్ద ఉన్న రంధ్రంలోకి వెళ్లి పోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

కేసీఆర్, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

వీణవంకలో తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దళితసంఘం నాయకులు

వీణవంక, జనవరి 30: దళితబంధు రెండో విడుత నిధుల విడుదలకు కృషి చేసిన తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చిత్రపటాలకు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గురువారం దళితసంఘం నాయకుల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతుల నర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ వోరెం భానుచందర్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు మహేశ్, నాయకులు దాసారపు రాజేందర్, కృష్ణచైతన్య, వోరెం రవి, మధు, క్రాంతి, పులాల మొండయ్య, దాసారపు వీరయ్య, దాసారపు కుమార్, దిలీప్, దాసారపు శంకర్, ఒడ్డెపెల్లి భూమయ్య, సునీల్, వేల్పుల కుమార్, భాస్కర్, యాసిన్, సంపత్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యను పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదు: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ టౌన్, జనవరి 30: హుజూరాబాద్ జర్నలిస్టుల ఇండ్ల సమస్యను పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 20 ఏళ్లుగా ఎదురుచూస్తున్న హుజూరాబాద్ నియోజకవర్గంలోని జర్నలిస్టులకు 2023 సెప్టెంబర్ 16న నివేశన స్థలాలను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న ఆ నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా అడ్డుకుంటోందని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. తక్షణమే సమస్యకు పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కుల కోసం తానే స్వయంగా ముందుండి పోరాడతానన్నారు.

అట్టహాసంగా మానేర్ ఖేల్ కుద్ 2025 ప్రారంభం



వార్షిక క్రీడాపోటీలను ప్రారంభించి వందనం చేస్తున్న మానేరు విద్యా సంస్థల అధినేత అనంతరెడ్డి

కొత్తపల్లి, జనవరి 30 : పద్మనగర్‌లోని మానేరు సీబీఎస్ఈ పాఠశాలలో మానేర్ ఖేల్ కుద్ -2025 పేరిట ఏర్పాటు చేసిన 39వ వార్షిక క్రీడా పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముందుగా మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డితో కలిసి మానేర్ క్రీడా పతాకాన్ని, ఒలింపిక్ క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. పాఠశాలలోని వివిధ గ్రూప్‌ల విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ చేయగా, ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. పాఠశాల స్పోర్ట్స్ కెప్టెన్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వాలీబాల్ సర్వీస్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డితో పాటు ప్రిన్సిపాల్స్ రాజు చాకో, సరితా రెడ్డి, పీఈటీలు సిలివేరి మహేందర్, తిరుపతి, జహేద, స్వామి, శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

75 ఏళ్ల వృద్ధురాలికి విజయవంతంగా తొంటి శస్త్ర చికిత్స

విద్యానగర్, జనవరి 30 : కరీంనగర్‌లోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో తొంటి విరిగిన ఓ వృద్ధురాలికి గుండె 30 శాతం పనిచేస్తున్నా గురువారం వైద్యులు శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వెంకట్రావ్‌పల్లికి చెందిన లచ్చమ్మ (75) కింద పడడంతో తొంటి విరిగింది. వైద్యులు పరీక్షలు చేయగా గుండె 30 శాతమే పని చేస్తున్నదని నిర్ధారించారు. దీంతో పాటు రక్తహీనత ఉందని గుర్తించారు. అయినప్పటికీ పూర్తి స్థాయి వైద్యుల పర్యవేక్షణలో గురువారం మత్తు స్పైనల్, ఎపిటరల్‌కు ఇచ్చి విజయవంతంగా శస్త్ర చికిత్స పూర్తి చేశారు. ఆర్థో విభాగానికి చెందిన డాక్టర్ ఆదిత్య, అనస్థిషియా డాక్టర్ సంగీత, డాక్టర్ మహేశ్, డాక్టర్ ఉబేదుల్లా పాల్గొన్నారు. వైద్య బృందాన్ని దవాఖాన సూపరింటెండెంట్ గుండా వీరారెడ్డి అభినందించారు.